# 7. వారసుడు

"పార్వతమ్మగారూ! ఈ గణపతి వట్టి దొంగ వెధవ! దగ్గిరికి రానీయకండి. తిండికిలేని వెధవలందరూ హాస్పిటల్ చేరుకుంటారు. కన్నేమరితే ఏదో ఒకటి పోయిందన్న మాటే!" అంది నీలవేణి జడ అల్లుకుంటూ.

మంచం పక్కనే మంచినీళ్ళ చెంబుతో నిలుచున్న గణపతిని పార్వతమ్మ కనులతోనే ప్రశ్నించింది,

గణపతి తలపంకించాడు.

నీలవేణి రిబ్బను ముడివేసుకుంటూ గణపతిని చూసింది.

"అవునవును! చాల గొప్పగా తల ఆడిస్తున్నావు. ఈసారి దొరకవా? చూడు, అప్పుడేం చేస్తానో?" అంది నీలవేణి, జడ ముడి చుట్టుకుంటూ.

పార్వతమ్మ ఎవరిని నమ్మాలో తెలియక గణపతిని, నీలవేణిని చూస్తూ ఊరుకుంది.

అప్పుడే మధ్యాహ్నం మూడు గంటలయింది. గైనిక్ వార్డులో తమను చూడ వచ్చేవారికోసం రోగులు ఎదురుచూస్తున్నారు. నీలవేణి మంచం, గోడకు దగ్గిరిగా, కిటికీ పక్కనే ఉంది. చిన్న బీరువాలో సామానులన్నీ సర్దుకొని తాళం వేసింది. దానిలో పళ్లు, బిస్కత్తు పొట్లాలు, రొట్టెలు, హార్లిక్సుసీసా, ఫ్లాస్కు, గళాసులు ఉన్నాయి. ఆమె ముఖం కడుక్కొని వచ్చి, చీర మార్చుకుంది.

వార్డు నర్సు మాత్రలేవో పట్టుకొని వచ్చింది.

నీలవేణి తనకిచ్చిన మాత్రలు వేసుకొని నీళ్లు తాగింది.

"సిస్టర్! కొంచెం అవతల కూర్చొని వస్తాను. నన్ను వెదక్కు!" అంది పక్క పేషెంటు దగ్గిరికి పోతున్న నర్సుతో.

పార్వతమ్మ తనకిచ్చిన మాత్రలు తీసుకొంది. ఆమెకు నీలవేణి మాటలు బోధపడలేదు.

కిటికీ దగ్గిరికి ఒక మనిషి వచ్చాడు. నీలవేణి నిముషంలో మాయమయింది. మరి కొద్దిసేపటిలో రోడ్డుమీద వాళ్లిద్దరూ చెట్టాపట్టాలు వేసుకొని, నర్సుల హాస్టలువేపు పోతున్నారు. నవ్వుతూ పక్కనున్న యువకుని మీదకు వంగి నీలవేణి నడుస్తున్నది.

పార్వతమ్మ తలచెడిన ఆడపడుచు నాలుగుకొట్టిన మరో అరగంటకు వచ్చింది.

ఇది పార్వతమ్మ మూడోసారి హాస్పిటల్‌లో చేరడం. కొత్తగా వచ్చిన డాక్టరమ్మగారు మంచి అనుభవమున్నవారని అందరూ అంటే ఆమె మళ్లా చేరింది. మొదటిసారి. చేరి మూడు వారాలున్న తరువాత డాక్టర్లు సమ్మె చేయడంతో, ఆమెను ఇంటికి పంపించారు. రెండోసారి

మంచినీటి సరఫరా వారం రోజుల వరకు ఆగిపోతే, కొత్తవాళ్లని ఇంటికి పొమ్మంటే విధిలేక వెళ్లిపోయింది. ఈ మూడోసారి ఏమవుతుందో?

శంకరంగారు డాక్టరమ్మగారిని కలిసివచ్చారు. ప్రోత్సాహకరంగా మాట్లాడారు. ఆపరేషనయితే తప్పకుండా గర్భం నిలుస్తుంది.

పార్వతమ్మ ,ఆడపడుచు తెచ్చిన రెండు దోసెలు తినలేక పోయింది. ఎవరికేనా ఒక ముక్క పెడదామని ఆమె ఇటూ అటూ చూసింది. కొంచెం దూరంలో పల్లెటూరి వాళ్ల మంచాల దగ్గిర కూర్చున్నాడు గణపతి.

ఆరు గంటలు కొట్టారు. చూడవచ్చిన వాళ్లు ఒకరూ ఒకరూ వెళ్లిపోయారు. పార్వతమ్మ మళ్లా అంతమందిలోనూ ఒంటరిదైపోయింది.

నీలవేణి మంచం దగ్గిరికి ఒకాయన వచ్చాడు. అతనికి నలభైయేళ్లు దాటి ఉంటాయి. నెరసిన జుత్తుకు తొందరలో రంగు వేసుకున్నాడు కాబోలు, వెనుకనున్న జుత్తు కొంత తెల్లగా, కొంత ఎర్రగా, ముందునున్నదంతా నల్లగా కనిపిస్తోంది.

"అమ్మగారూ! ఈ బెడ్‌మీదున్న మా ఆడమనిషి ఎక్కడికెళ్లింది?" అతడు పార్వతమ్మను అడిగాడు.

"నాకు తెలీదు బాబూ!" అంది పార్వతమ్మ.

"మీతో చెప్పలేదా?"

"లేదు"

"ఎన్ని గంటలకు వెళ్లింది?"

"అందరూ చూడడానికి వచ్చే వేళలో వెళ్లినట్లుంది. మా వాళ్లతో మాట్లాడుతూ నేనంతగా గమనించలేదు. అంతవరకు ఇక్కడే ఉంది."

అటువేపే మెల్లిగా వస్తున్న గణపతిని చూశాడు నీలవేణి యజమాని.

"ఒరేయ్ కుర్రాడా!" చేతిని ఊపాడు వచ్చిన అతను.

గణపతి ఏమీ జవాబివ్వలేదు.

"ఒరేయ్! నీకే! వినిపించడం లేదా?"

గణపతి అక్కడినుండి వెళ్లిపోవాలని తిరిగిపోయాడు. పెద్దమనిషి వడిగా అటువేపు వెళ్లి కుర్రాడి చేయి పట్టుకొని ఆపాడు.

"ఎక్కడికెళ్లింది నీలవేణి?"

గణపతి ముఖం దించుకున్నాడు. ఫెళ్లుమంది పెద్దమనిషి చెయ్యి కుర్రాడి చెంపమీద. గణపతి బుగ్గ తడుముకున్నాడు. నాలుగువేళ్లు అంటుకుపోయాయి.

"చెప్పు! చెప్పకపోతే చీరేస్తాను?"

గణపతి నోరెత్తలేదు. కాని, పెద్దమనిషి మళ్లా చెయ్యి చేసుకున్నాడు. మూడోసారి వణుకుతూ అన్నాడు గణపతి.

"కొట్టకండి!.. చెప్తాను. చెప్తాను. కొట్టకండి!"

"మరి చెప్పు"

"ఆవిడ నర్సుల హాస్టలువేపు వెళ్లారు."

"ఒక్కర్తేనా?"

గణపతి మళ్లా ఆగిపోయాడు. యజమాని చెయ్యి మళ్లా లేచింది.

"ఆయనతోనే!..."

గణపతిని పక్కకుతోసి, ఆ పెద్దమనిషి వార్డు వదిలి వెళ్లిపోయాడు.

అక్కడే, గోడకు దగ్గరగా నిలబడి, బుగ్గలు తడుముకుంటూ గణపతి బెక్కుతున్నాడు.

పార్వతమ్మకు ఈ వ్యవహారమేమీ బోధపడలేదు. పదేళ్ల కుర్రాడిని విచక్షణా రహితంగా ఆ పెద్దమనిషి కొట్టడం ఆమెకు నచ్చలేదు. గణపతిని పిలిచి సంగతేమో కనుక్కుందామని అనుకుంది.

ఇంతలో నీలవేణి వడివడిగా వార్డులోకి వచ్చింది. అంతవరకూ వచ్చిన ఆమె యజమాని ఆమెతో లోనికి రాలేనట్లుంది.

"వెధవా! ఏం చెప్పావురా మా యజమానితో?"

జవాబుకోసమే నా ఎదురుచూడకుండా గణపతిని ఎడాపెడా చెంపలు వాయించింది.

"పో! ఇక్కడినుంచి! నా సంగతి చెప్పడానికి నువ్వెవడివిరా? బికారి వెధవలకు కళ్లు నెత్తికొచ్చాయి?"

ఏడ్చుకుంటూ గణపతి అక్కడనుండి వెళ్లిపోయాడు. దూరంగా వాళ్లమ్మ మంచంమీద బాధతో మూలుగుతోంది.

నీలవేణి మళ్లా తన ప్రియుడితో హోటలులో భోజనం చేయడానికి వెళ్లిపోయింది.

ఇంతలో దీపాలన్నీ ఆరిపోయాయి. తిరుగుతున్న పంకాలన్నీ ఆగిపోయాయి. పొంచి మాటుకాసిన చీకటి వార్డుని తన ఒడిలోకి తీసుకుంది.

అడుగుల చప్పుడు వినిపిస్తూ తన మంచం దగ్గిర ఆగిపోతే పార్వతమ్మకు భయం వేసింది.

"దొడ్డమ్మగారు!" వెక్కుతూ గణపతి అన్నాడు.

"ఏం గణపతీ!"

"ఆస్పత్రిలో అప్పుడప్పుడు దీపాలు ఆరిపోతుంటాయి. ఈ సంగతే మీతో చెప్పాలని వచ్చాను - మీరు భయపడకండి?"

"అవును - నాకీ విషయం తెలీదు."

"నా చెయ్యి పట్టుకోండి - భయముండదు"

ఆమె ఆ పదేళ్ల కుర్రాడి చెయ్యి పట్టుకుంది - గాలిలో దీపంలా కొట్టుకుంటున్న ఆమె గుండె నిలకడబడింది.

"నీకు భయం వెయ్యదా గణపతీ!"

"కొత్తలో ఎంతో భయం వేసేది. మాటి మాటికీ దీపాలు ఆరిపోయేవి. ఈ ఆసుపత్రిలో బాదపడి, బాధపడి చచ్చిపోయినవాళ్లు చీకటి చుట్టుకోగానే గాలిలోతేలుతూ మీదకి వచ్చినట్లయేది."

ఆ మాటలకు ఆమె గుండె వేగంగా కొట్టుకుంది.

"దొడ్డమ్మగారు! ఒక్కొక్కసారి వాళ్లందరూ ఆయాలు, తోటీలు పెట్టే బాధలు భరించలేక చచ్చిపోయామని చెప్తున్నట్లనిపిస్తుంది."

అంత భయంలోను ఆమెకు నవ్వు వచ్చింది.

"మరి డాక్టర్లో?"

"డాక్టర్లు చాల మంచివాళ్లు - వాళ్లకి రాత్రీ లేదు, పగలూ లేదు. చావుతో దెబ్బలాడుతారు వాళ్లు - దొడ్డమ్మగారు! అబ్బాయిలు, ఆడపిల్లలు నవ్వుతూ పనిచేస్తారు - ఆ నవ్వులతో రోగుల బాధలన్నీ దూరం చేస్తారు. వాళ్లకి విసుగు, విరామం లేవు. వాళ్లను తలుచుకుంటే చెట్టుమీది గులాబిపూలు దేవుడి పాదాలమీది పారిజాతంపూలు జ్ఞాపకం వస్తాయి."

పార్వతమ్మకు ఏమనాలో తెలియలేదు -దెబ్బలకు హడలిపోయిన చిన్నవాడి గుండె, ఆ చీకటిలో, దుఃఖాగ్నిని బయటపెడుతుందని ఆమెఅనుకుంది. కాని, ఈ హృదయపు లోతులనుంచి వస్తున్న తీయటి సెలయేటి భావజలాలు అంత నిర్మలంగా ఉంటాయని ఆమె కలలోనైనా ఊహించలేదు.

ఇంతలో దీపాలు వచ్చాయి. గణపతి తల్లి దగ్గిరికి వెళ్లిపోయాడు.

తెల్లారింది.

"దొడ్డమ్మగారు! రాత్రి నిద్రపోయారా?" గణపతి నవ్వుతూ వచ్చి పొద్దున్నే కుశల ప్రశ్నవేశాడు. మళ్లా అన్నాడు.

"కాఫీ తెమ్మన్నారా? ఫ్లాస్కు కడిగి తెస్తాను."

పార్వతమ్మకు కాఫీ తెచ్చి, టిఫిన్ ఇచ్చి, గణపతి తన తల్లి మంచం దగ్గిరికి వెళ్లాడు. వార్డులో ఎవరెవరో గణపతిని పిలుస్తునే ఉన్నారు.

క్రమంగా పార్వతమ్మకు అర్థమయింది. నీలవేణికి కడుపుపోతే ఆస్పత్రిలో చేర్చారు. ఆమె మొగుడు వారానికి రెండుసార్లు వస్తాడు. ఆమె ప్రియుడు రోజుకి రెండుసార్లు వస్తాడు. మొగుడితో ఆమె మాట్లాడదు. మొగుడు కాని వాడితో రోజంతా గడుపుతుంది. చేరిన నాలుగురోజులు మాత్రం మంచం మీద ఉంది. తరువాత, ఆమెకు హాస్పిటల్ విడిదయింది. ఏదో నెపం పెట్టి ఆమె అక్కడే ఉండిపోతోంది. మరి గణపతిమీద వాడి తల్లిమీద కోపమెందుకు?

హాస్పిటల్ వార్డులలో ఉదయం మొదలయిన సంరంభం మధ్యాహ్నం రెండు గంటలతో చల్లారిపోతుంది. డాక్టర్లు భోజనాలకు వెళ్లి, నర్సులు డ్యూటీలు మారి, రోగులు విశ్రాంతి తీసుకొని, వాతావరణంలో కొంత శాంతి కనిపిస్తుంది. ఆపరేషన్లు కావలసినవాళ్లు, అయిన తరువాత బాగా కోలుకున్నవాళ్లు వార్డులలో ఈ సమయంలో పచార్లు చేస్తుంటారు.

ఏమీ తోచక పార్వతమ్మ వార్డులో నర్సులున్న గదివేపు వెళ్లింది.

నలుగురయిదుగురు రోగులు, వాళ్ల దగ్గిర ఉన్నవాళ్లు ఒక పక్కన కూర్చున్నారు. వాళ్లమధ్య గణపతి ఉన్నాడు. వీడిచేతిలో కథలపుస్తకమేదో ఉంది. గొంతుక అప్పుడప్పుడు హెచ్చించి. అప్పుడప్పుడు తగ్గించి, మధ్య మధ్య చేతులాడించి, శ్రోతలను తన్మయులను చేస్తున్నాడు. పార్వతమ్మ ఎంతసేపు వింటూ నిలుచుందో!

మర్నాడు సాయంకాలం కాబోలు - వార్డులో పరుగెత్తుతున్నాడు, గణపతి- "ఎక్కడికి గణపతీ!" పార్వతమ్మ పిలుపందుకోలేదు వాడు - పరిస్థితి బాగులేని బీదరాలికోసం డాక్టర్నను పిలుచుకొచ్చాడు.

పంపులలోకి మంచినీళ్లు రాలేదు - ఆమె గణపతి కోసం వెదకింది. పైనున్న హోటలు నుంచో, దిగువ పంపులనుంచో నీళ్లు తెస్తాడని. ఒకరి దగ్గిరవాడు ఉత్తరం వ్రాస్తున్నాడు - ఉత్తరం పూర్తయిన తరువాత ఆ మనిషి వాడి చేతిలో డబ్బులు పెడుతుంటే, నవ్వుతూ వద్దని లేచిపోయాడు.

సాయంకాలం నాలుగయింది. నీలవేణి ముస్తాబయింది బయటికి వెళ్లిపోడానికి., ఆమె పార్వతమ్మ వేపు చూసింది. తరువాత వార్డు నలుపక్కల ఎవరికోసమో చూసింది. పిమ్మట ప్రియుడితో వెళ్లిపోయింది. నీలవేణి మొగుడు మరో అరగంటకు వచ్చాడు. అతనుకూడా ఎవరికోసమో వెదకి వెళ్లిపోయాడు. వాళ్లు గణపతి కోసం వెదుకుతున్నారని పార్వతికి అర్థమయింది. గణపతిని వాళ్లు వెదుకుతున్నారు. ఎదురుపడితే కొడతారని వాడు భయపడి పారిపోయాడని ఆమె అనుకుంది. మనసుండబట్టక, రాత్రి గణపతి కనిపించగనే అడిగింది.

"ఏంరా! గణపతీ! సాయంకాలం పూట కనిపించడం లేదే!"

నీలవేణి మీద ఏమైనా చెప్తాడని ఆమె అనుకుంది.

"అవును దొడ్డమ్మగారు! మాస్టరుగారికి అప్పుడే తీరిక - లెక్కలు చెప్తున్నారు. ఆయన దగ్గిరికి వెళ్తున్నాను" అన్నాడు.

ఆమెకు ఏమనాలో బోధపడలేదు.

పార్వతమ్మ హాస్పిటలులో చేరిన పదిరోజులకు గణపతి తల్లికి ఆపరేషను చేశారు. ఆవేళ కూడా వాళ్ళ నాన్న రాలేదు -మధ్యాహ్నం రెండు గంటలకి ఆమెను మంచంమీద వేశారు. నిమ్మకాయ ముక్కకోసి, రోగి పెదవులకు రాస్తూ ముక్కుకు చూపిస్తూ, పక్కనున్న రోగులు ఏవో ఓదార్పు మాటలు చెప్తుంటే, ధైర్యం చిక్కబట్టుకుంటున్నాడు గణపతి.

పార్వతమ్మ కూడా అక్కడికి వెల్లింది. ఆమెను చూడగానే వాడి గుండెల్లో అణగారిన దుఃఖం కట్టలు తెంచుకొని వచ్చింది.

"గణపతీ! దొడ్డమ్ముండగా నీకు భయం దేనికిరా!" అంటూ ఆమె వాడిని గుండెకు హత్తుకుంది.

ఆ మాటలకు నోటితో చెప్పలేని కృతజ్ఞతలు చూపులద్వారా వెలిబుచ్చాడు.

ఆవేళ పొద్దున్న పదిగంటలకు వెల్లిన పార్వతమ్మ టెస్టులన్నీ అయి మంచం దగ్గిరికి వచ్చేసరికి మద్యాహ్నం ఒంటిగంట దాటిపోయింది. పక్కమంచంమీదనున్న ఆడమనిషిని పిలిచి "మావాడు గణపతి, అక్కడుంటే పిలువమ్మా! మంచినీళ్ల తెచ్చిపెడతాడు" అంది పార్వతమ్మ.

"గణపతి బాబు నేడమ్మగోరూ" అంది ఆ మనిషి.

"ఏమయ్యాడు"

"ఆల్లమ్మగోర్ని పంపేసినారు"

"ఇంకా వారంరోజులుండాలని ప్రొద్దున్నే అన్నారుకదా!"

"ఏటో మరి! కొత్తగా ఆపరేషన్ సేసినోరికి పక్కల్లేవట"

పార్వతమ్మకు చేయి విరిగినట్లయింది - పంపులలో నీళ్ల లేవు. తెచ్చేవాళ్ల లేరు - వేళ తప్పింది - సాయంకాలం ఆడబడుచు వచ్చేవరకు ఆమె నీరసంగా మంచంమీద పడుక్కుంది.

మరునాడు పార్వతమ్మగారికి ఆపరేషను చేస్తామని చెప్పారు. శంకరంగారు వివరాలు కనుక్కోడానికి వెళ్లారు - ఆడపడుచు మామూలుగా పన్నెండింటికి భోజనం పంపించింది.

శంకరంగారు వెల్లిన కొద్దిసేపటిలో మెల్లిగా గణపతి పార్వతమ్మ దగ్గిరికి వచ్చాడు. వాడి ముఖం వాడిపోయి ఉంది. కళ్ల లోతుకు పోయాయి.

"దొడ్డమ్మగారూ!"

"అమ్మకెలా ఉంది గణపతీ!"

గణపతి మాట్లాడలేదు. ముఖం దించుకున్నాడు.

"చెప్పు! ప్రమాదం లేదు కదా!" ఆత్రతతో ఆమె అడిగింది.

"లేదు. . కడుపునొప్పిగా ఉంది"

"తీసుకురాలేకపోయావా?"

"డాక్టరుగారు అలా ఉంటుందన్నారు."

"మరి ఎలా తగ్గుతుంది?"

గణపతి మాట్లాడలేదు. సంకోచిస్తున్నాడు.

"చెప్పు ..ఫరవాలేదు"

"ఏదేనా తింటే కడుపు నొప్పి తగ్గుతుంది."

ఆ చిన్నవాడి కళ్లల్లో ఆ దయగల తల్లి అన్ని విషయాలు చదువుకుంది.

"వెర్రివాడా! ఇంత దాపరికమెందుకు... నాకు అట్టే ఆకలి లేదు. భోజనం తీసుకుపో, కారియర్‌తోనే--"

"వద్దు! . . మీరు తినకుండా ఇవ్వొద్దు."

"సరే!. . "

ఆవిడ విస్తరాకులో పొట్లాం కట్టింది భోజనం - ఆకు చిరిగిపోకుండా గుడ్డ చుట్టింది.

ఇంతవరకు వాళ్ల సంభాషణ వింటున్న నీలవేణి ఒక్కసారి లేచింది మంచంమీదనుంచి.

పక్కనే ఉన్న వార్డుబోయిని పిలిచి చెవిలో ఏదో చెప్పింది. దూరంగానున్న తోటీ దగ్గిరికి వెళ్లి చెప్పింది. వీళ్లందరినీ పారితోషికాలిచ్చి ఆమె తన అదుపులో ఉంచుకుంది.

గణపతి వార్డులోంచి వరండాలోకి వెళ్లి, మెట్లు దిగి బయటకు వెళ్లాడు.

గణపతి రోడ్డుమీదకొక్క బోయేసరికి ఇద్దరు వార్డుబాయిలు, ముగ్గురు తోటీలు వాడిని చుట్టుకున్నారు.

పార్వతమ్మ ఒక కిటికీ దగ్గిరికి వెళ్లి నిలబడింది.

నీలవేణి మరో కిటికీ దగ్గిర నిలబడి చూస్తున్నది.

"ఏంటది?" ఒకడడిగాడు.

"రొట్టా? . . . చెంచాలా?. . " మరొకర్తె అడిగింది.

"ఆసుపత్రి భోజనమా?" మరొకడడిగాడు.

గణపతి మాటలు దక్కి నిలబడ్డాడు.

"చెప్పరా!"

"ఇప్పరా మూట!"

"దొంగ గుంటడా! . . నీబాబుగారి సొమ్మురా? . . అన్నీ ఎత్తుకుపోడానికి"

గణపతి మాట్లాడకుండా గుడ్డ ముడివిప్పి, రెండు చేతులలోను జాగ్రత్తగా విడిన ఆకును, లోపలి అన్నాన్ని బైటపెట్టాడు.

ఒకడు చేతిలోనున్న కర్రతో ఆకును కొట్టాడు. ఆకు చిరిగి అన్నమంతా నేలను పడింది.

రెండవవాడు గణపతి తొడమీద కొట్టాడు.

"అడుక్కునేవాడిని కొట్టకండర్రా" ఒక తోటీ జాలిదలచింది.

పార్వతమ్మకు ఈ మాటలన్నీ వినిపిస్తున్నాయి. కడుపులో చేయిపెట్టి దేవినట్లయింది. ఆపుకున్నా కన్నీళ్లాగలేదు.

నీలవేణి నవ్వుతోంది.

"ఆగు రంగయ్యా!" ఉరిమాడు గణపతి.

"అబ్బో! పిట్ట కూతపట్టిందే!"

"ఆగు సింహాద్రీ! . . నేను కుర్రాడినని మీకు వేళాకోళంగా ఉందా. . వినండి . . అందరి కాళ్లు పట్టుకొని, బిచ్చమెత్తి, ఊడిగంచేసి, చదువుకుంటాను - ఈ మెడికల్ కాలేజీలోనే చేరి డాక్టరయి వస్తాను . మీ రోగాలకు అదొక్కటే మందు."

వాళ్లందరూ వెనక్కి తగ్గిపోయారు.

ఆశ్చర్యంతో తన చెవులను కళ్లను నమ్మలేకపోయింది పార్వతమ్మ - అప్రయత్నంగా కళ్లనిండా సంతోషంతో నీరు నిండింది.

శంకరంగారు మెల్లిగా వచ్చి ఆమెతో అన్నారు.

"నీళ్లు లేవట - మరో నెల తరువాత ఆపరేషన్ చేస్తారట."

"ఆ వెళ్లిపోతున్న గణపతిని ముందు ఆపండి - మరే వారసుడు అక్కర్లేదు - ముదిమిలో పుట్టినవాడు మంచివాడవుతాడా? . . మన ఆస్తికి ఇంతకన్న మంచి వారసుడెవడు దొరుకుతాడు.'

అంది పార్వతమ్మ, బోర విరుచుకొని ముందుకు పోతున్న గణపతిని - భర్తకు చూపిస్తూ.